సాక్షి
కుమురంభీం

గురువారం । 1 । జూన్ । 2023



'ట్రిపుల్ఐటీ' నోటిఫికేషన్ విడుదల

బాసర ట్రిపుల్ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నారు. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్అర్బన్: బావులకు విద్యుత్ మోటార్లు అమర్చేందుకు రిజిస్టర్ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్డీవో సురేందర్ తెలిపారు. టెక్స్మో సీఆర్ఐ, కేఎస్బీ, ఏరియన్, లుబి, ఫాల్కన్ కంపెనీలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు ఈ నెల 6లోగా జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.1/28.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి.

న్యూస్రీల్

గోయగాం గ్రంథాలయానికి విరాళం



నూతనంగా కొనుగోలు చేసిన సామగ్రి

సాక్షి ఎఫెక్ట్

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చెందిన విద్యార్థులు సొంతంగా గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. అయితే సరైన పుస్తకాలు, టేబుళ్లు, ర్యాకులు లేక వారు పడుతున్న ఇబ్బందులపై మే 19న 'సాక్షి' పుస్తక దాతలు కావలెను అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కాగజ్నగర్కు చెందిన సింగరేణి ఉద్యోగి ఎల్ములే హన్మంతు తన వంతు సాయంగా మంగళవారం రూ.10వేలు విరాళంగా అందించారు. ఈ నగదుతో యువకులు ర్యాకులు, బల్లలు, కుర్చీలు, బల్లలు, పుస్తకాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ జాబితా విడుదల

ఆసిఫాబాద్అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ ప్రతిపాదికన జిల్లాలో ఆయుష్ వైద్యాధికారుల నియామకానికి సంబంధించి అభ్యర్థుల మెరిట్ లిస్టును డీఎంహెచ్వో కార్యాలయంలోని నోటీసు బోర్డుతోపాటు https:// asifabad. telangana. gov. in వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్వో రామకృష్ణ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 3 సాయంత్రం 5 గంటలలోగా తగిన ఆధారాలతో డీఎంహెచ్వో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పొగాకు వాడకాన్ని నివారించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి(ఆసిఫాబాద్): ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు వాడకాన్ని నివారించాలని డీఎంహెచ్వో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పొగాకు నివారణ దినోత్సవంలో పాల్గొన్నారు. డీఎంహెచ్వో మాట్లాడుతూ పొగాకు వాడకంతో ప్రాణాలు ముప్పు వాటిల్లుతుందన్నారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు సంభవిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు డీఎంహెచ్వో ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రోగాం ఆఫీసర్ ధరమ్ సింగ్, టీ- హబ్ ఇన్చార్జి సత్యనారాయణ, మండల వైద్యాధికారి ఉప్రె వినయ్, హెచ్ఈవో రవిదాస్, సూపర్వైజర్ కమల, సిబ్బంది పాల్గొన్నారు.



కాగజ్నగర్ మండలం పెద్దవాగు సమీపంలో పట్టుబడిన దేశీదారు మద్యం (ఫైల్)

మహా కిక్కు..!

- జిల్లాలోకి దేశీదారు ప్రవాహం
- నిఘా కళ్లు గప్పి స్మగ్లింగ్ చేస్తున్న వైనం
- పలు రకాల్లో లభిస్తున్న మహారాష్ట్ర మద్యానికి జిల్లాలో డిమాండ్

- ఈ ఏడాది జనవరి 21న మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన ఆదర్శ పటేల్ అనే వ్యక్తి భద్రావతి నుంచి కారులో అక్రమంగా 34 దేశీదారు కాటన్లు తరలిస్తుండగా వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1.19 లక్షలు.
- కాగజ్నగర్ పట్టణంలోని విజయ్బస్తీలో మే 20న అక్రమంగా 298(90ఎంఎల్) దేశీదారు బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.
- మే 21న వాంకిడిలోని లక్ష్మీనగర్కు చెందిన కొట్రంగె స్వామి మహారాష్ట్ర నుంచి 68 దేశీదారు బాటిళ్లు తీసుకొస్తున్న క్రమంలో స్థానిక పోలీసులకు పట్టుబడ్డాడు.
- చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామంలో దేశీదారు విక్రయిస్తున్న పూల్చంద్ను మే 22న ఎక్సైజ్ సీఐ వికాస్ అరెస్టు చేశారు. అతడి నుంచి 16 కాటన్ల బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- రెబ్బెన మండలం గోలేటికి చెందిన జాడి కేశవ్ మే 28న మహారాష్ట్ర నుంచి అక్రమంగా 76 దేశీదారు(90ఎంఎల్) బాటిళ్లను తరలిస్తుండగా వాంకిడి చెక్పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు.
- తాజాగా మంగళవారం మహారాష్ట్ర నుంచి రెండు కార్లలో రూ.1.80 లక్షల విలువైన 30 దేశీదారు కాటన్లను తరలిస్తున్న నలుగురిని కాగజ్నగర్ మండలంలో టాస్క్ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

ఈ గణాంకాలే జిల్లాలో దేశీదారు మద్యం స్మగ్లింగ్ జరుగుతున్న తీరుతెన్నుల పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

సాక్షి, ఆసిఫాబాద్: మహారాష్ట్రలో చంద్రాపూర్ జిల్లాలో మద్య నిషేధం ఎత్తివేసిన తరువాత కుమురంభీం జిల్లాలోకి దేశీదారు ప్రవాహం పెరిగింది. అంతకు ముందు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండేది. 2020 వరకు మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలో మద్యపాన నిషేధం అమల్లో ఉండేది. ఫలితంగా జిల్లాలోని కాగజ్నగర్ ఎక్సైజ్ పరిధిలో గల 14 మద్యం దుకాణాల నుంచి బెల్టుషాపుల ముసుగులో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు లిక్కర్ స్మగ్లింగ్ జరిగేది. ఫలితంగా ఇక్కడి లిక్కర్ దుకాణాలకు యమ డిమాండ్ ఉండేది. 2020లో అక్కడి ప్రభుత్వం తెలంగాణ నుంచి పెద్దఎత్తున మహారాష్ట్రలోకి లిక్కర్ స్మగ్లింగ్ జరుగుతున్న విషయాన్ని గమనించి చంద్రాపూర్ జిల్లాలో మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ క్రమంలో అక్కడ ప్రీమియం, సెమీ ప్రీమియంతో దేశీదారు అమ్మకాలకు అనుమతిస్తూ దుకాణాలు తెరవడంతో ఒక్కసారిగా తెలంగాణ సరిహద్దు మద్యం దుకాణాల వ్యాపారంపై ప్రభావం కనిపించడం ప్రారంభమైంది. 2020 వరకు ప్రతీ మద్యం దుకాణం నుంచి సగటున నెలనెలా రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు లిక్కర్ మహారాష్ట్రలోకి బెల్టుషాపుల ద్వారా గుట్టుగా సరఫరా అయ్యేది.

సీన్ రివర్స్..

ప్రస్తుతం ఇదే తరహాలో మహారాష్ట్ర వైపు నుంచి తెలంగాణలోకి మద్యం స్మగ్లింగ్ జరుగుతుండటంతో ఎక్సైజ్ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ముఖ్యంగా అక్కడి చీప్ లిక్కర్గా పరిగణిస్తున్న దేశీదారు వెరైటీని ఇక్కడి మద్యంప్రియులు అమితంగా ఇష్టపడుతుండడంతో అక్కడి వ్యాపారులు చీకటి మాటున భారీగా దేశీదారును జిల్లాలోకి తరలిస్తున్నారు. దేశీదారు మద్యంలో సంత్ర, బనానా, మ్యాంగో, నిమ్మ, సోంపు, లవంగా, దాల్చిన చెక్క రుచులతో మద్యం పంపిణీ చేస్తుండటంతో ఇక్కడి మద్యం ప్రియులు కూడా తెలంగాణ మద్యం కంటే అక్కడి దేశీదారును తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో మహారాష్ట్రలో దేశీదారు దుకాణాల వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు చెబుతున్నారు. రెండున్నరేళ్లుగా దేశీదారును నియంత్రించేందుకు ఎక్సైజ్ యంత్రాంగం రేయింబవళ్లు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమ రవాణా మాత్రం నియంత్రించలేకపోతున్నారు.

అడ్డదారుల్లో అక్రమ రవాణా..

ఆసిఫాబాద్, కాగజ్నగర్ సర్కిళ్ల పరిధిలో 32 మద్యం దుకాణాలు, 3 బార్లు ఉన్నాయి. ఏటా రూ.250 కోట్ల వరకు సరకు అమ్ముడవుతోంది. ప్రస్తుతం దేశీదారు మద్యం ఏరులై పారుతుండడంతో కాగజ్నగర్ సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల్లో అమ్మకాలు భారీగా పడిపోయినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఆసిఫాబాద్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఒకే ఒక ప్రధాన రహదారి ఉండడంతో ఇక్కడ పకడ్బందీగా మద్యం రవాణాను నియంత్రిస్తున్నారు. అయితే కాగజ్నగర్ పరిధికి వచ్చేసరికి స్మగ్లింగ్ను అరికట్టడం అధికారులకు సాధ్యం కావడం లేదు. ఇక్కడ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు పదికిపైగా రహదారులు ఉండటమే కాకుండా మరో పదిహేను వరకు అడ్డదారులు ఉన్నాయి.

దేశీదారు కట్టడికి చర్యలు

జిల్లాలో దేశీదారు, గుడుంబా కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర నుంచి వచ్చే మార్గాల్లో ఎక్సైజ్, పోలీసులతో కలిసి చెక్ పాయింట్లు ఏర్పాటు చేశాం. చెక్ పోస్టులోనూ నిరంతర తనిఖీలు చేస్తున్నాం. రైళ్లలోనూ నిత్యం తనిఖీలు జరుపుతున్నాం. అక్రమ మద్యంతో రాష్ట్ర రెవెన్యూ ఆదాయం తగ్గకూడదన్న లక్ష్యంతో గట్టి నిఘా పెట్టి దేశీదారు రవాణాను అడ్డుకుంటున్నాం.– బి.జ్యోతి కిరణ్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి

'దశాబ్ది' సంబురాలు అంబరాన్నంటాలి



మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, పక్కన కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు

- గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్
- అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది సంబురాలు జిల్లాలో అంబరాన్నంటాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్పాయ్, రాజేశంతో కలిసి దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలతోపాటు 22 వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందు కు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతులు, మైనార్టీల సంక్షేమం, దళిత బంధు పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అంతకు ముందు ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్కు కలెక్టర్, అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ కరుణాకర్, డీపీఆర్వో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ సుంకరి రాజు

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజు హాజరవుతారని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పణ, 9 గంటలకు కలెక్టరేట్లో జాతీయ పతాకావిష్కరణ, 9.05 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరణ, 9.10 గంటలకు ప్రసంగం, 9.20 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.30 గంటలకు ధన్యవాద ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలో సహకార బ్యాంకు ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి, తదితరులు

ఆసిఫాబాద్: రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని, సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జుబ్లీ మార్కెట్ సమీపంలో డీసీసీబీ రుణం రూ.40 లక్షలతో నిర్మించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, రూ.50 లక్షల నాబార్డ్ నిధులతో ఎమ్మెస్సీ స్కీమ్ కింద నూతనంగా నిర్మించిన గోదాంలను బుధవారం డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్పాయ్, రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సింగిల్విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ రైతును రాజును చేసేందుకు సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. సహకార సంఘాల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీబీ గోదాం ద్వారా రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, సహకార సంఘాల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, డీఎస్వో తారామణి, సీఈవో శ్రీధర్రెడ్డి, బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ రాజేందర్ కుమార్, డైరెక్టర్లు మురళి తదితరులు పాల్గొన్నారు.

'బడి బాట' విజయవంతం చేయాలి

- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్రూరల్: జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలతో సమావేశమయ్యారు. డీఈవో మాట్లాడుతూ 17 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. జిల్లాలో 37 ఉన్నత పాఠశాలలు డిజిట్ బోధనకు సిద్ధమైనట్లు తెలిపారు. బడుల ప్రారంభం రోజే యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు సత్తయ్య, సుభాష్, ఉదయ్బాబు, రాము, అబీద్ అలీ పాల్గొన్నారు.

పుస్తకాల విక్రయానికి దరఖాస్తుల ఆహ్వానం

2023- 24 విద్యాసంవత్సరంలో జిల్లాలో పుస్తకాల విక్రయానికి ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విక్రయదారులకు వ్యాట్ లైసెన్స్(కమర్షియల్ టాక్స్), క్యాటర్లీ రిటర్న్ టర్నోవర్ టాక్స్, ఆడిట్, జీఎస్టీ రిపోర్టులు ఉండాలన్నారు. రూ.2 వేల డీడీని జిల్లా విద్యాశాఖ పేరుతో తీసుకుని డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'బడి బాట'కు సన్నద్ధం

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యం
- ఈ నెల 3 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ
- నేటి నుంచి కార్యాచరణ ప్రారంభం



కెరమెరి మండలం సాంగ్విలో బడి బాట ర్యాలీ (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, గుణాత్మక విద్యాబోధన తదితర అంశాల గురించి ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించనున్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి బడిబాటను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటంతో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో 738 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 738 ఉన్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలలు 75, ప్రాథమికోన్నత పాఠశాలలు 103, ప్రాథమిక పాఠశాలలు 560 ఉన్నాయి. దాదాపు 42వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి. మన ఊరు- మన బడి పథకం కింద జిల్లాలో 251 పాఠశాలలు ఎంపిక కాగా, 30 చోట్ల పనులు సైతం పూర్తయ్యాయి. ఉచిత యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఇంగ్లిష్ మీడియంలో బోధనతో సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. గత విద్యాసంవత్సరం కంటే అదనంగా 20 శాతం విద్యార్థుల సంఖ్యను పెంచాలనదే ప్రభుత్వ లక్ష్యం. గురువారం పాఠశాల స్థాయిలో ప్రతినిధులు, సంబంధిత విభాగాల సమన్వయ సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ రూపొందించనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎస్హెచ్జీ సభ్యులు, ఆశ కార్యకర్తలతో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 9 వరకు పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. 12న మన ఊరు- మన బడి, మన ఊరు- మన బస్తీ, 13న తొలిమెట్టుపై అవగాహన, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న సీడబ్ల్యూఎస్ఎన్, బడిబయట పిల్లల గుర్తింపు 16న ఇంగ్లిష్ మీడియంపై అవగాహన, 17న బాలికా విద్య, కెరీర్ గైడెన్స్పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలి. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు ఉపాధ్యాయులతోపాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

– పి.అశోక్, డీఈవో

కార్యక్రమాలు ఇలా..

- గ్రామాలు, పట్టణాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్ఎంసీ సభ్యులతో కలిసి ర్యాలీలు నిర్వహిస్తారు. బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలతో ఇంటింటికీ ప్రచారం చేస్తారు.
- మన ఊరు- మన బడి, ఇంగ్లిష్ మీడియం, తొలి మెట్టు తదితర కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులను చైతన్య పరుస్తారు.
- అంగన్వాడీ కేంద్రాల్లో అర్హత కలిగిన పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించే విధంగా అంగన్వాడీ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి.
- బడీడు పిల్లలు, బడి మానేసిన విద్యార్థులను స్వయం సహాయక సంఘాల సహకారంతో పాఠశాలల్లో చేర్పించాలి.
- సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలను గుర్తించి పాఠశాలలు/ భవిత కేంద్రాల్లో చేర్పించాలి.



రెబ్బెనలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ

- 5 నుంచి 14 ఏళ్ల బడిబయట పిల్లల జాబితా రూపొందించాలి.
- బాల కార్మికులను గుర్తించాలి.
- సమీప ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు 5, 7వ తరగతి విద్యార్థుల బదిలీల నమోదుపై సమాచారం ఇవ్వాలి.
- గ్రామ విద్యా రిజిస్టర్ నవీకరించాలి.
- పిల్లల్లో పాఠశాల విద్యపై ఆసక్తి కలిగేలా సంసిద్ధత కార్యక్రమాలు చేపట్టాలి.

నినాదాలు

- ప్రభుత్వ బడి- అమ్మ ఒడి
- ప్రభుత్వ విద్య- ఉచిత విద్య
- సర్కారు బడి పిల్లలు- సత్తా కలిగిన పిడుగులు
- ప్రభుత్వ బడులు ముద్దు- ప్రైవేటు బడులు వద్దు
- ప్రభుత్వ బడిలో చేర్పు- మీ పిల్లవాని తలరాత మార్పు
- ప్రభుత్వ బడిలో చదువు- పిల్లవాని జీవితాల్లో మలుపు
- గ్రామాల్లో పాఠశాలలు- దేశానికి పట్టుగొమ్మలు
- ప్రభుత్వ పాఠశాలలు- మీ పిల్లల భవితకు పునాదులు
- మన ఊరు.. మన బడిని- మనమే కాపాడుకుందాం

స్టేషన్ నుంచి దొంగ పరార్?

- రెండు రోజులుగా గాలింపు
- దొరక్కపోవడంతో అన్నను స్టేషన్లో ఉంచిన వైనం
- తప్పిదం కప్పిపుచ్చే ప్రయత్నాల్లో పోలీసులు
- ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలంటూ మంగళవారం ప్రకటన
- ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి టేకం రామారావు.. కరుడుగట్టిన దొంగ. ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో అనేక దొంగతనాలు చేశాడు. తాజాగా శనివారం ఓ చోరీ కేసులో ఆసిఫాబాద్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా.. ఆదివారం మధ్యాహ్నం నిందితుడు వారి కళ్లుగప్పి పరారైనట్లు సమాచారం. రెండు రోజులపాటు పోలీసులు అనేకచోట్ల గాలిస్తున్నా దొంగ దొరకలేదు. ఘరానా దొంగ స్టేషన్ నుంచి తప్పించుకుపోయాదన్న విషయం బయటకు పొక్కితే పరువు పోవడమే కాకుండా ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని స్థానిక పోలీసులు ఆ విషయాన్ని కప్పిపుచ్చి మంగళవారం సరికొత్త నాటకానికి తెరతీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. – సాక్షి, ఆసిఫాబాద్

ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

'గతంలో ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలు, ఇతర ప్రాంతాల్లో అనేకసార్లు దొంగతనాలకు పాల్పడ్డ టేకం రామారావు ప్రస్తుతం ఆసిఫాబాద్ పట్టణంలో చోరీలు చేయడమే లక్ష్యంగా తిరుగుతున్నాడు. ఇతన్ని ఎవరైనా చూసినా.. అతని ఆచూకీ తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వండి. దొంగ ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.' అంటూ మంగళవారం ఆసిఫాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా సోమవారం కేస్లాపూర్లో నివసిస్తున్న టేకం రామారావు అన్న టేకం శ్రీహరిని పోలీసులు ఎందుకు హడావుడి పోలీసుస్టేషన్కు తరలించారు? రెండు రోజులుగా అతడిని స్టేషన్లోనే ఎందుకు ఉంచుకుంటున్నారు? తమ్ముడి ఆచూకీ తెలపాలంటూ శ్రీహరిపై ఎందుకు ఒత్తిడి తెస్తున్నారు? అనే అనేక ప్రశ్నలకు సమాధానం లేకపోవడం గమనార్హం. స్థానికుల సమాచారం మేరకు.. టేకం రామారావును శ్రీహరి ఇంటి నుంచి శనివారం పోలీసులు తీసుకెళ్లారు. అతన్ని విచారిస్తున్న క్రమంలోనే పరారీ కావడంతోటే శ్రీహరిని పోలీసులు స్టేషన్కు తీసుకెళ్లారని సమాచారం. అయితే పోలీసులు మాత్రం టేకం రామారావు ఆసిఫాబాద్ పట్టణాన్ని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నట్లు ప్రకటన ఇవ్వడం.. అదే సమయంలో అతడి సోదరుడిని స్టేషన్లో ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వార్డెన్గా పనిచేస్తూ..

టేకం రామారావు తండ్రి తుకారాం ఐటీడీఏ పరిధిలో హాస్టల్ వార్డెన్గా పనిచేశారు. తుకారాం అనారోగ్యంతో మృతి చెందడంతో అతని భార్యకు ఆ ఉద్యోగం లభించింది. ఆమె సైతం మృతి చెందడంతో రామారావుకి తల్లి ఉద్యోగం వచ్చింది. అతడు ఇచ్చోడ బాలుర హాస్టల్ పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించినట్లు సమాచారం. ఆ తరువాత రామారావు దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇటీవల దొంగలించిన బంగారు ఆభరణాలను ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ బంగారు వ్యాపారికి విక్రయించినట్లు పోలీసులకు సమాచారం అందడంతో అతడిని కేస్లాపూర్లో అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించినట్లు తెలుస్తోంది.

అదుపులోకి తీసుకోలేదు

టేకం రామారావు అనేక దొంగతనాల్లో నిందితుడు. ఆసిఫాబాద్లోనూ చోరీలకు పాల్పడ్డాడు. అతని ఆచూకీ కోసం గాలిస్తున్న నేపథ్యంలో కేస్లాపూర్లో ఉన్నాడనే సమాచారంతో రామారావును పట్టుకునే ప్రయత్నం చేశాం. కానీ అతను అప్పటికే అక్కడి నుంచి పరారయ్యాడు. మేం అతని అదుపులోకి తీసుకుని విచారించలేదు. స్టేషన్ నుంచి అతను పరారీ కాలేదు. అయితే అతని ఆచూకీ ఏమైనా తెలుసా అంటూ టేకం శ్రీహరిని స్టేషన్కు పిలిపించి వివరాలు అడిగాం. అతను రామారావు గురించి తనకు ఏం తెలియదని తెలిపాడు.

– రాణాప్రతాప్, సీఐ, ఆసిఫాబాద్

క్లుప్తంగా

విదేశాల్లో కార్పెంటరీ ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: విదేశాలలో ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, హంగేరీ, జపాన్, పోలాండ్, రుమేనియా, యూకే గల్ఫ్ దేశాల్లోని నిర్మాణ రంగంలో పనిచేయడానికి ఐటీఐ కార్పెంటరీ అర్హత గల వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో పని చేయాలనుకునేవారు మూడేళ్ల ఒప్పంద కాలంలో పనిచేయాల్సి ఉంటుందని, సంవత్సరానికి జీతం రూ.30లక్షల వరకు ఉంటుందని, వయస్సు 35 ఏళ్లకు మించకుండా ఐటీఐ విద్యార్హత ఉండాలని, విదేశాలకు ప్రభుత్వం తరపున వివిధ పనుల నిమిత్తం వెళ్లడానికి రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం)ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు వెబ్‌సైట్ WWW.tomcom.telengana.gov.in ను సందర్శించాలని, ఫోన్ నంబర్ 7893566493, 8328602231లలో సంప్రదించాలన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న సతీశ్ కుటుంబీకులు

జైపూర్: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో ఈ నెల 17న కొరకొప్పుల సతీశ్‌గౌడ్ అనే యువకుడు బావిలో పడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు అదే గ్రామానికి చెందిన పులి శ్రీనివాస్‌గౌడ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నెల 17న ఇద్దరు కలిసి నస్పూర్ పట్టణంలో బంధువుల శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో ఇద్దరు మద్యం సేవించి పులి శ్రీనివాస్‌గౌడ్ పొలం వద్ద ఉన్న బావి వద్ద కూర్చున్నారని, సతీశ్‌గౌడ్‌ను బావిలో శ్రీనివాస్‌గౌడ్ తోశాడని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇరుకుటుంబీకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నింధితులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉపేందర్ హామీ ఇచ్చారు.

వడదెబ్బతో ఒకరి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి నెర్పెల్లి పెంటయ్య(58) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామంలోని బంధువులను కలిసేందుకు మధ్యాహ్నం ఇంటి నుండి నడుచుకుంటూ బయలుదేరాడు. స్థానిక చెరువు కట్ట వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య కమల, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కొత్త బంగారులోకం


విద్యార్థులు (ఫైల్)



- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడితప్పితే భవిష్యత్ అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- జూన్ 1 నుంచి కళాశాలలు

ఆదిలాబాద్‌టౌన్: ఇప్పటి వరకూ పాఠశాల చదువు.. ఇకనుంచీ కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం.. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు.. అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజీలో అత్యంత కీలక సమయమిది. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్ దశనే. ఏమాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశ కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 31,959 మంది విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరనున్నారు.

స్నేహం ప్రభావితం..

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది.. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీదా అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
ఆదిలాబాద్	9,366
మంచిర్యాల	8,552
నిర్మల్	8,980
కుమురంభీం	5,061

చదువుకే తొలి ప్రాధాన్యం..

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. పాఠ్యాంశాలపై దృష్టి సారించాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిసి గ్రూప్ స్టడీ చేయడం అత్యంత కీలకం.

ఆకర్షణకు లోనుకావొద్దు..



ఇంటర్ చదివే విద్యార్థులు ఎక్కువగా ఆకర్షణకు లోనవుతారు. దీంతో చదువుపై శ్రద్ధ కనబర్చలేరు. చిన్న వయస్సులోనే ప్రేమ, పెళ్లితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలి. భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలి.

– డాక్టర్ రమ, గైనకాలజిస్ట్

ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన వి ద్యార్థులు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలా విహరిస్తారు. స్వేచ్ఛ జీవిగా భావిస్తారు. అప్పు డే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, సిగరేట్లు, మద్యం సేవించడం, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటి వాటికి గురికాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాష్, సైక్రియాట్రిస్ట్

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



ఎస్సెస్సీ తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఇంటర్‌లో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవా లి. ప్రేమ, సినిమా, షికార్ల వైపు దృష్టి మళ్లే వయస్సు ఇది. అటుగా దృష్టిసారిస్తే భవిష్యత్ అంధకారం అవుతుంది. పదో తరగతి వరకు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండడంతో విద్యార్థులకు భయం అనేది ఉంటుంది.

– సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న ప్రతినిధులు

తాండూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను బుధవారం వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు సందర్శించారు. న్యూయార్క్‌ల నుంచి వచ్చిన వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు నిర్మల వెదుల, దీపక్ అలోక్, గౌవర్ బామ్మీ తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి బ్యాంక్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ పరిధిలో నిర్వహిస్తున్న కష్టమర్ సర్వీస్ పాయింట్ యూనిట్‌లను ప్రత్యక్షంగా పరిశీలించారు. కష్టమర్లకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా పల్లె ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబన, స్వ యం ఉపాధి కల్పన కోసం రుణాల మంజూ రు, రికవరీ, ఇన్సూరెన్స్ కల్పించడంలో కష్టమర్ సర్వీసు పాయింట్ అందిస్తున్న సేవల ను పనితీరును పర్యవేక్షించారు. ఇందులో జీ ఎం ఐటీ విభాగం అధికారి వీఎస్ మహేష్, రీజినల్ మేనేజర్ టి.మురళీ మనోహర్‌రావు, బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రభుదాస్, సీఎస్పీలు తిరుపతి, శరత్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నస్పూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం... శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6గని కాన్కూర్ గ్రామ సమీపంలోని రిజర్వు ఫారెస్టు ఏరియాలో మృతదేహాన్ని గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 60 నుంచి 70ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతదేహానికి ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేశారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల


నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

- ఈ నెల 5నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 26న ఎంపిక జాబితా విడుదల
- నోటిఫికేషన్ విడుదల చేసిన వీసీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం బుధవారం యూనివర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ వెంకటరమణ, డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, క్యాంపస్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. 1,605 సీట్లు ఈ విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 5నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 1,404 జనరల్ సీట్లు, స్పెషల్ కేటగిరీ కింద 96, గ్లోబల్ కోటాలో 105 సీట్లు, మొత్తంగా 1,605 సీట్లు భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా సంస్థ వెబ్‌సైట్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలకు సంబంధించి మూడు పేజీల దరఖాస్తు ప్రతి ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. వెబ్‌సైట్‌లో కాలమ్‌లో అడిగిన వివరాలు నమోదుచేసి ప్రింట్ తీసుకుని ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను ట్రిపుల్‌ఐటీ అధికారులకు రిజిష్టర్, స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించాలి.

ఈ నెల 16వరకు దరఖాస్తు గడువు

ట్రిపుల్‌ఐటీలో 1,404 జనరల్ సీట్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జూన్ 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఈ నెల 24వరకు దరఖాస్తు గడువు ఉంది. ఈ నెల 26న ఎంపికైన విద్యార్థుల జాబితాను ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రకటించనున్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు మూడు హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచనున్నారు. ఏ సమస్యలున్నా 7416002245, 7416058245, 741612245 నంబర్లకు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు www.rgukt.ac.in / www.admissions.rgukt.ac.in లో చూడాలని సూచించారు.

విద్యావిదానం ఇదీ..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు బోధిస్తారు. అనంతరం పీయూసీలో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే వెసులుబాటు కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులు సమకూరుస్తారు. ల్యాప్‌టాప్‌తోపాటు యూనిఫాంలు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతన ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బుధవారం రోడ్డుపక్కనే గల విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో స్తంభం లారీపై పడింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. మద్దికల్ గ్రామంలోని ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేసిన బస్తాలను లారీల ద్వారా కరీంనగర్ జిల్లాలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పరిధిలోనే స్తంభం ఉండడంతో దానిని తప్పించే ప్రయత్నం చేసినప్పటికీ బస్తాలు తగిలి స్తంభం లారీపై పడింది. విద్యుత్ స్తంభం విరిగిన అనంతరం లారీని పక్కకు తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ లైను మొత్తం కిందపడిపోయే ప్రమాదం ఉండడంతో లారీని అలాగే ఉంచారు.


కరెంట్ స్తంభానికి ఢీకొట్టిన ధాన్యం బస్తాల లారీ

చెప్పినా పట్టించుకోవడం లేదు

గ్రామంలో రోడ్డు పరిధిలోని విద్యుత్ స్తంభాలను తొలగించి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే స్పందిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు. – ఓడేటి వాణి, సర్పంచ్, మద్దికల్

చెట్టును ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట బస్టాప్ వద్ద బుధవారం అదుపుతప్పి ఇసుక లారీ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కృష్ణస్వామి(35) మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడ్‌తో నిర్మల్ వెళ్తున్న లారీ అదుపు తప్పి గుల్లకోట వద్ద రోడ్డుపక్కన ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఇందులో డ్రైవర్ ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మృతదేహాన్ని జేసీబీ సాయంతో బయటకు తీశారు. కృష్ణస్వామి నిర్మల్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


చెట్టుకు ఢీకొన్న లారీ

కోతకు గురైన తాత్కాలిక వంతెన



కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి పెద్ద వాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన బుధవారం కోతకు గురైంది. కురిసిన అకాల వర్షాలతో పెద్దవాగులో నీటిమట్టం పెరిగింది. దీంతో తాత్కాలిక వంతెన కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు మినహా వేరే వాహనాలు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం వరకూ రాకపోకలు పునఃప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

శ్రీరాంపూర్‌లో 92శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో మే నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 92శాతం సాధించినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మే నెల 6.26 లక్షల టన్నులకు 5.79 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. కేవలం భూగర్భగనులు మాత్రం నిర్దేశించిన లక్ష్యంలో 103శాతం సాధించడం జరిగిందన్నారు. ఇందారం ఓసీపీ 107 శాతం, శ్రీరాంపూర్ ఓసిపి 83 శాతం సాధించడం జరిగిందన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ పనుల్లో జాప్యంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయామన్నారు. ఇదిలా ఉంటే ఈనెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి అక్కడి నుంచి కార్మిక వాడల మీదుగా జీఎం కార్యాలయం వరకూ ర్యాలీ ఉంటుందని తెలిపారు. జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5 న సింగరేణి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో డీజీఎం (పర్సనల్) అరవింద్ రావు డీజీఎం (ఐఈడి) చిరంజీవి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

నూతన నియామకం

పాతమంచిర్యాల: బీసీ సంఘాల ఐక్యవేదిక లీగల్ అడ్వైజర్‌గా అడ్వకేట్ రెడ్డిరాజుల రాములును నియమించినట్లు బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. బీసీ సమాజానికి న్యాయ సాయం అందించడానికి బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా రాములు సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కో–కన్వీనర్ సంగం లక్ష్మణ్, నాయకులు ఒడ్డెపల్లి మనోహర్, నస్పూరి అఖిల్, జంబోజు శ్రీనివాస్ అడ్వకేట్‌లు రంగు మల్లేష్, భుజంగరావు, కనకయ్య, పాల్గొన్నారు.


నియామక పత్రం అందిస్తున్న శ్రీనివాస్

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఓ యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... కిష్టంపేట గ్రామానికి చెందిన రాజు(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కామిని శ్రీనివాస్ ఇంటి నిర్మాణ పనులకు కూలీగా వెళ్తున్నాడు. బుధవారం పనులు ముగించుకుని కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు విద్యుత్ మోటారు ఆన్‌చేయగా విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వాటర్‌మెన్ మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): బైక్ అదుపు తప్పి బోల్తాపడటంతో నంబాల గ్రామానికి చెందిన వాటర్‌మెన్ దుర్గం దేవాజీ (61) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... నంబాలలోని బాలాజీనగర్‌కు చెందిన దేవాజీ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పని పనిచేస్తున్నాడు. బుధవారం ఆసిఫాబాద్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా ఇందిరానగర్ వద్ద అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్రగాయమైంది. స్థానికులు 108లో రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడుకి భార్య సుశీల, కుమారుడు, కూతురు ఉన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గుఉత్పత్తి పెరుగుదలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గత మాసం బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. మేలో మందమర్రిలోని రెండు ఓసీల్లో 100శాతం ఉత్పత్తి సాధించగా ఏరియా వ్యాప్తంగా 90శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. మరో ఏడాదిన్నర కాలం తరువాత ఆర్కే ఓసీ మూతపడే అవకాశం ఉందన్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు, ఆర్కే ఓసీ కాలపరిమితి మరికొంత కాలం ఉండేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, కేకే–ఓసీ పీవో రమేష్, ఆర్కే–ఓసీ పీవో గోవిందరావు, డీవైపీఎం మైత్రేయబంధు, అధికారులు శ్రీనివాసులు ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి